


# విభారె

## తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 15 జూలై 2021 సంపుటి : 02 సంచిక :352 పేజీలు : 4 వెల : రూ 3-00


## మూడో ముప్పువేళ.. ఈ కాంవడ్ యాత్ర ఏంటి..?

### యూపీ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిన సుప్రీం



దిల్లీ: కరోనా మూడోముప్పు పొంచి ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ) ప్రభుత్వం కాంవడ్ యాత్రకు అనుమతి ఇవ్వడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో యాత్రను ఎందుకు అనుమతించారో సమాధానం చెప్పాలంటూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ విషయాన్ని కోర్టు స్వయంగా పరిగణనలోకి తీసుకుంది. దీనికి సంబంధించిన తదుపరి విచారణ శుక్రవారం జరగనుంది. జులై 25 నుంచి కాంవడ్ యాత్రకు యూపీ ప్రభుత్వం భక్తులను అనుమతించనుంది. ఈ యాత్రలో భాగంగా ఏటా శ్రావణ మాసంలో పక్షం రోజుల పాటు శివ భక్తులు గంగా నదీ జలాలను సేకరిస్తుంటారు. కఠిన ఆంక్షల మధ్య, పరిమిత సంఖ్యలో కాంవడ్ యాత్ర జరుగుతుందని మంగళవారం యూపీ ప్రభుత్వం తెలిపింది. యాత్రికులు తమ వెంట ఆర్టీపీసీఆర్ నెగెటివ్ నివేదికను తప్పనిసరిగా తెచ్చుకోవాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. మరో రాష్ట్రం ఉత్తరాఖండ్ మాత్రం కాంవడ్ యాత్రను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. కోట్లాది మంది పాల్గొనే మతపరమైన కార్యక్రమాలకు అనుమతులిస్తే కరోనా మూడోవేవ్‌కు అవకాశాలు పెరుగుతాయన్న వైద్య నిపుణుల అభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ‘ప్రజలు చనిపోవడాన్ని దేవుళ్లు కూడా కోరుకోరు’ అంటూ ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి వ్యాఖ్యానించారు. రెండో దఫా కరోనా విజృంభణ తగ్గుముఖం పట్టడంతో పలు రాష్ట్రాలు ఆంక్షలను సడలించాయి. దాంతో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రజలు పోటెత్తిన దృశ్యాలు నెట్టింట్లో దర్శనమిస్తున్నాయి. దీనిపై స్వయంగా ప్రధాని కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మనం ఆహ్వానిస్తేనే కరోనా వస్తుందని, వైరస్ నిబంధనలను ఉల్లంఘించ వద్దంటూ ప్రజలను హెచ్చరించారు.

## చేపల వినియోగం పెంచడానికి హబ్‌లను ఏర్పాటు చేస్తున్నాం: సీఎం జగన్



అమరావతి: ఆక్వా రైతులకు మంచి ధరలు అందాలని, ఈ లక్ష్యాలను చేరుకోవడానికి రాష్ట్రంలో వినియోగం పెంచే దిశగా ఆక్వా హబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చేపల వినియోగం పెరగాలని, సరసమైన ధరలకు ప్రజలకు చేరాలని ఆయన అధికారులకు సూచించారు. పశుసంవర్ధకశాఖ, డెయిరీ, ఫిషరీస్ విభాగాలపై వైఎస్ జగన్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. చేపల రవాణా, నిల్వ తదితర అంశాల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలన్నారు. ఆక్వా యూనివర్శిటీ ఏర్పాటుపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక్వా లాబ్స్‌ను వినియోగించుకోవడంపై ప్రచారం, అవగాహన కల్పించాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. ఆక్వా రంగానికి సంబంధించి క్వాలిటీ చెకింగ్స్ ఎలా చేయించుకోవాలన్నదానిపై అవగాహన పెంచాలన్నారు. ఈ ల్యాబ్‌లను ఆర్బీకేలకు అనుసంధానం చేయాలని, ఆక్వా సీడ్, ఫీడ్‌ల విషయంలో ఎలాంటి కల్తీలు ఉండకూడదని తెలిపారు.

కేజ్ ఫిష్ కల్చర్‌పై కార్యాచరణ ప్రణాళిక

5 ఫిషింగ్ హార్బర్లు, 1 ఫిష్ ల్యాండ్ సెంటర్‌లో పనులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. మిగిలిన చోట్ల కూడా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేజ్ ఫిష్ కల్చర్, మరీకల్చర్‌లపై దృష్టి పెట్టాలని, ఆదాయాలు బాగా పెరుగుతాయని తెలిపారు. కేజ్ ఫిష్ కల్చర్‌పై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, రైతులు, ఔత్సాహికులతో కలిసి ముందుకు సాగేలా ఒక ప్రణాళిక తీసుకురావాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద మూడు చోట్ల కేజ్ ఫిష్ కల్చర్, మూడు చోట్ల మరీకల్చర్‌లను మొదలుపెట్టాలని తెలిపారు. వెటర్నరీ డిస్పెన్సరీల్లో హేతుబద్ధత ఉండాలని, ప్రతి గ్రామం, మండలంలో ఏం ఉండాలనేదాన్ని నిర్ధారించాలని అధికారులకు సీఎం సూచించారు.

డిస్పెన్సరీలు ఆర్బీకేలతో అనుసంధానం

హేతుబద్ధత ప్రకారం డిస్పెన్సరీలను పెట్టాలని, తర్వాత వాటిని మెరుగ్గా నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. డిస్పెన్సరీలు ఆర్బీకేలతో అనుసంధానం చేయాలన్నారు. అయితే కొన్ని డిస్పెన్సరీలు లేని మండలాలు కూడా ఉన్నాయని అధికారులు ముందు మ్యాపింగ్ చేసి తర్వాత వాటిని ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల్లో నాడు-నేడుపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నాడు-నేడులో భాగంగా నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను ముందు నిర్ధారించుకోలన్నారు. తర్వాత పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ఈ సమీ సమావేశానికి మంత్రి సీదిరి అప్పలరాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్‌లో లాల్ దర్వాజ బోనాల వేడుకలు

న్యూఢిల్లీ: గత ఏడు సంవత్సరాలుగా ఢిల్లీలో మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు జరుపుతున్న లాల్ దర్వాజ సింహవాహిని ఆలయ కమిటి ఈసారి ఘనంగా నిర్వహించింది. ఢిల్లీ తెలంగాణ భవన్ లో జరిగిన బోనాల ఉత్సవాలకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కిషన్ రెడ్డి హాజరైయ్యారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రులు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు పండుగను కేంద్ర ప్రభుత్వ ప్రముఖ పండుగల జాబితాలో చేర్చేలా కృషి చేస్తానన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా బోనాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటూ వస్తున్నామని, దేశంలోని రైతుల, ప్రజలు పంటలను రక్షించాలని, రోగాల నుంచి రక్షించాలని అమ్మవారిని ప్రార్థించారు. గత ఏడాది నుంచి కరోనా కారణంగా ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే అవకాశం లేకపోయిందని, సాధారణ పరిస్థితుల్లో భారీ ఎత్తున మహిళలు, ప్రజలు పాల్గొంటారని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరపున, ప్రధాని తరపున తెలంగాణ ప్రజలకు బోనాలు పండుగ శుభాకాంక్షలు తెలపారు. కరోనా మహమ్మారి నుంచి విముక్తి లభించాలని, కరోనాపై పోరులో ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానట్టు మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## ఏడాది తర్వాత తొలిసారి సమావేశమైన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర కేబినెట్ బుధవారంనాడు సమావేశమైంది. ప్రధాని మోదీ అధికారం నివాసంలో ఈ సమావేశం జరిగింది. వర్చువల్ తరహాలో కాకుండా ఫిజికల్ మీటింగ్ జరగడం ఏడాది తర్వాత ఇదే ప్రథమం. జూలై 7న మంత్రి వర్గ పునర్వవస్థీకరణ తర్వాత మంత్రులంతా సమావేశం కావడం కూడా



ఇదే మొదటిసారి. రెండు రోజుల క్రితం కేబినెట్ కమిటీలను పునర్వవస్థీకరించిన తర్వాత ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. కోవిడ్‌పై పోరాటంలో ఎలాంటి అలసత్వం వద్దని మంత్రులకు ప్రధాని ఈ సమావేశంలో సూచించారు. ప్రజలు మాస్కులు లేకుండా సామాజిక దూరం పాటించకుండా రద్దీ ప్రాంతాల్లో తిరుగుతున్న ఫోటోలు, వీడియోలు కనిపిస్తున్నాయని, దీంతో అందరిలోనూ ఒకతరహా భయం నెలకొంటోందని అన్నారు. కోవిడ్ ప్రోటోకాల్‌ను ప్రజలు పాటించకపోవడం మంచిది కాదన్నారు. కాగా, పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 19న ప్రారంభమై ఆగస్టు 13తో ముగుస్తాయి.

## ఏపీలో కొత్తగా 2,591 కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల్లో కొత్తగా 2,591 కరోనా కేసులు నమోదు కాగా, వైరస్ ప్రభావంతో 15 మంది మృతి చెందారు. తాజాగా 3,329



మంది కరోనా బాధితులు కోలుకుని డిశ్చార్జ్ కాగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 18,87,670 మంది బాధితులు కోలుకున్నారు. మహమ్మారి బారినపడి మొత్తం 13,057 మంది ప్రాణాలు వదిలారు. ప్రస్తుతం రాష్ట్రంలో 25,957 మంది యాక్టివ్ కేసులు ఉన్నాయి. కాగా రాష్ట్రంలో ఇప్పటివరకు 2,32,20,912 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బుధవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.

## 18న అఖిలపక్ష భేటీ!

దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. సమావేశాలకు ముందురోజు (ఆదివారం) ఈ భేటీ జరగనుంది. ఇందుకోసం పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు ఆహ్వానం పంపారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ సమావేశాలు జరిగే ముందు అన్ని రాజకీయ పార్టీలతో ఇటువంటి భేటీ జరగడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఎలాంటి ఆటంకాలూ లేకుండా సభలు సజావుగా జరిగేలా చూడాలని అన్ని రాజకీయ పార్టీలను కేంద్ర ప్రభుత్వం కోరనుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 19 నుంచి ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఇందుకోసం ఎంపీలందరూ కరోనా వ్యాక్సిన్ తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ్యులకు సూచించారు. ఇప్పటివరకూ 323 మంది ఎంపీలు వ్యాక్సిన్‌ను పూర్తిస్థాయిలో తీసుకోగా ఇతర ఆరోగ్య కారణాల వల్ల మరో 23 మంది వ్యాక్సిన్ తీసుకోలేదని చెప్పారు. రెండు సభలు ఏకకాలంలోనే ఉదయం 11గంటలకు ప్రారంభమవుతాయని స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు.



## తెలుగు అకాడమీ తెదేపా అకాడమీ కాదు: ఆదిమూలపు


అమరావతి: తెలుగు అకాడమీలో సంస్కృతాన్ని కలిపి తెలుగు-సంస్కృత అకాడమీగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేస్తే ప్రతిపలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నాయో అర్థం కావడం లేదని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. తెలుగు భాష అభివృద్ధి, మరింత విస్తృతం చేసేందుకే కేబినెట్‌లో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ద్రవిడ భాష నుంచి ఆవిర్భవించిన తెలుగులో పరిశోధన కోసం సంస్కృతాన్ని జోడించి అకాడమీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలుగు అకాడమీ తెలుగుదేశం పార్టీ అకాడమీ కాదని ఆ పార్టీ నేతలు గుర్తించాలని..



తమ విమర్శలు సరిచేసుకోవాలని హితవు పలికారు. తెదేపా అధినేత చంద్రబాబు హయాంలో తెలుగు అకాడమీ అస్థిత్వాన్ని కోల్పోయిందని ఆదిమూలపు ఆరోపించారు. సంస్కృతం భారతీయ భాషలకు మూలమన్నారు. దీని ప్రభావం తెలుగుపై చాలా ఎక్కువ ఉంటుందని.. రెండింటినీ వేర్వేరు భాషలుగా చూడలేమని వివరించారు. తెలుగు భాష మూలాలను తెలుసుకోవాలంటే పరిశోధన చేయాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విభజన తర్వాత రెండేళ్లలో తెలుగు అకాడమీని ఏపీలో ఏర్పాటు చేయలేకపోయారని.. అందుకే ఇప్పుడు రెండింటినీ కలిపి తెలుగు-సంస్కృత అకాడమీగా ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

## ఆయన్ను నమ్ముకున్నోళ్లంతా జైలుకే: చంద్రబాబు

### తప్పులు చేస్తే మీ పరిస్థితీ అదే.. అధికారులకు తెదేపా అధినేత హెచ్చరిక



మచిలీపట్నం: కరోనా నియంత్రణలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని.. తెదేపా అధికారంలో ఉంటే కొవిడ్‌ను కట్టడి చేసేవాళ్లమని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్నో సంక్షోభాలు వచ్చినా వాటిని సవాలుగా తీసుకుని పనిచేశామని చెప్పారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఇటీవల మృతిచెందిన మాజీ మంత్రి నరసింహారావు (కొల్లు రవీంద్ర మామ) కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. కొల్లు రవీంద్ర ఇంటికి వెళ్లి నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం తెదేపా శ్రేణులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. పండించిన ధాన్యం కొని రైతులకు ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని చంద్రబాబు ఆరోపించారు. ఎవరైనా డబ్బు అడిగితే ఎమ్మెల్యేలు, మంత్రులు దౌర్జన్యం చేస్తున్నారని ఆక్షేపించారు. తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. పోలీసులను అడ్డంపెట్టుకుని కొంత వరకే పాలించగలరని.. రైతులు తిరగబడితే పారిపోతారని హెచ్చరించారు. కేసులకు తాము భయపడే పరిస్థితే లేదన్నారు. ఈ ప్రభుత్వాలు శాశ్వతం కాదని.. పోలీసులు కూడా హుందాగా ప్రవర్తిస్తూ పద్ధతి ప్రకారం పనిచేయాలన్నారు. ఆయన్ను నమ్ముకున్నోళ్లంతా జైలుకు పోయారని సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తప్పులు చేస్తే మీ పరిస్థితి కూడా అగమ్యగోచరంగా తయారవుతుందని అధికారులను హెచ్చరించారు. మాస్కు పెట్టుకోకుంటే ప్రభుత్వం రూ.100 జరిమానా విధిస్తోందని.. అలాంటప్పుడు మాస్కు పెట్టుకోని జగన్‌కు ఎంతమేర జరిమానా విధించాలని చంద్రబాబు ప్రశ్నించారు. ఆత్మలతో కాదు.. మనుషులతో మాట్లాడేవాళ్లు కావాలని వ్యాఖ్యానించారు. చెత్తపై కూడా పన్ను వేసిన చెత్త ప్రభుత్వమిదని మండిపడ్డారు. వైకాపా నేతలు దిల్లీ మెడలు వంచుతామని.. దిల్లీ మెడలు వంచుతున్నారన్నారు. పోలవరం ముంపు బాధితులకు పునరావాసం కల్పించకుండా గిరిజనులను గోదావరిలో ముంచుతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. వారికి న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు.

# సంపాదకీయం

గురువారం 15 జూలై 2021

## ప్రపంచ ఆధిపత్యం కోసం చైనా ప్రయత్నం

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక జనాభా గల చైనా అంతర్జాతీయంగా సత్తా చాటేందుకు ఆరాట పడుతోంది. ప్రపంచ ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోంది. పరోక్షంగా అమెరికా ఆధిపత్యానికి గండి కట్టేందుకు అన్నిశక్తులు సమీకరించుకుంటోంది. ఐరాస భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశంగా, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గల డ్రాగన్ దూకుడు ప్రదర్శిస్తోంది. పంచాధిపత్యం కోసం సామ, భేద, దండోపాయాలను ప్రదర్శిస్తోంది. వివిధ అంతర్జాతీయ సంస్థల అధిపతులుగా తన మనుషులుగా ప్రతిష్టించడం, లేదా ఆయా సంస్థలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపించడం ద్వారా తన ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. బ్రిటన్ కు చెందిన ఓ కమిటీ ఈ విషయాన్ని వెల్లడించింది. 11మంది సభ్యులు గల పార్లమెంటరీ ఫారిన్ ఎఫైర్స్ కమిటీ అధ్యయనంలో ఈ విషయం వెలుగుచూసింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్), అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం, ఇంటర్ పోల్ (ఇంటర్నేషనల్ క్రిమినల్ పోలీసు ఆర్గనైజేషన్), ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ ఏ ఓ- ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్) వంటి అంతర్జాతీయ సంస్థలపై చైనా ప్రభావం స్పష్టంగా కనపడుతోంది. వివిధ దేశాలకు, వివిధ అంతర్జాతీయ సంస్థలకు ఆర్థిక సాయం చేయడం ద్వారా వాటిపై డ్రాగన్ పట్టు కొనసాగిస్తోంది. మరోవైపు అమెరికా తరవాత ఆధిపత్య దేశంగా చిన్న దేశాలపై ప్రభావం చూపుతోంది. 2010- 19 మధ్య కాలంలో చైనా విరాళాలు 348 శాతం పెరిగాయి. డొనాల్డ్ ట్రంప్ హయాంలో ప్రపంచ సంస్థలకు అమెరికా విరాళాలు బాగా తగ్గాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న చైనా అంతర్జాతీయంగా విరివిగా విరాళాలు ఇస్తూ తన ప్రభావాన్ని చూపుతోంది. పరిధిని విస్తరించుకుంటూ వస్తోంది.ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతిగా టెడ్రోస్ వ్యవహరిస్తున్నారు. 2017లో ఆయన ఎన్నికకు చైనా మద్దతిచ్చింది. అంతకుముందు టెడ్రోస్ వెనక బడిన ఆఫ్రికా దేశమైన ఇథియోపియో మంత్రిగా వ్యవహరించారు. ఈ దేశానికి చైనా పెద్దయెత్తున నిధులు సమకూర్చింది. వాస్తవానికి టెడ్రోస్ వైద్యుడు కూడా కారు. 2019లో వెలుగు చూసిన కరోనాకు చైనాయే కారణమన్న విమర్శలు, ఆరోపణలు పెద్దయెత్తున వచ్చాయి. యావత్ అంతర్జాతీయ సమాజం దాదాపుగా చైనాను అభిశంసించింది. అయినా ప్రపంచ ఆరోగ్య సంస్థ చైనాను ఎక్కడా తప్పుపట్టలేదు. అదేపనిగా చైనాను వెనకేసుకొచ్చింది. ఇప్పటికీఅదే పరిస్థితి. కీలకమైన మరో అంతర్జాతీయ సంస్థ ప్రపంచ మానవ హక్కుల సంస్థలోనూ చైనా మనుషులు ఉన్నారు. చైనాలోని 'ఉయ్ ఘుర్' తెగకు చెందిన ముస్లింలపై వేధింపులు కొనసాగుతున్నాయి. వారిని అణచి వేస్తున్నారు. అయినా ప్రపంచ మానవహక్కుల సంస్థ మౌనంగా వ్యవహరిస్తోంది.కీలకమైన ఇంటర్ పోల్ (ఇంటర్నేషనల్ క్రిమినల్ పోలీస్ ఆర్గనైజేషన్) పైనా చైనా ప్రభావం ఉంది. ఇది అంతర్జాతీయ నేరగాళ్ల ఆచూకీ కనిపెట్టేందుకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేస్తుంటుంది. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ ఏ ఓ ? ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్) లోనూ చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. తాజాగా ఆసియా, ఆఫ్రికా ఖండాలను కలిపే మార్గం బీ ఆర్ ఐ (బెల్ట్ రోడ్ ఇనిషియేటీవ్) ద్వారా అనేక దేశాలతో సంబంధాలు కలిగి ఉంది. ఇందులో చేరేందుకు భారత్ ససేమిరా అనడం చైనాకు మింగుడు పడలేదు. ఇప్పటికే దక్షిణాసియాలోని భారత్ ఇరుగు పొరుగు దేశాన నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక,పాకిస్థాన్ లపై పట్టు పెంచుకుంటోంది. మొత్తానికి అంతర్జాతీయంగా ఆధిపత్యాన్ని చాటుకునేందుకు, పెంచుకునేందుకు తద్వారా అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేసేందుకు బీజింగ్ నాయకత్వం అవిశ్రాంతంగా శ్రమిస్తోంది.

# రాజీ...నామాలేనా గంటా



విశాఖపట్టణం, జూలై 14, (న్యూస్ పల్స్)ఎపుడో అయిదు నెలల క్రితం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం బయటకు వచ్చింది. అంతే ఉన్న ఉదుటున విశాఖ నార్త్ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామా చేశారు. తనతో పాటు మొత్తం అధికార పార్టీ ఎమ్మెల్యేలు అంతా రాజీనామా చేయాలని కేంద్రం మీద వత్తిడి తేవాలని ఆయన కోరారు. అయితే గంటా శ్రీనివాసరావు చేసిన పనికి షాక్ తిన్న టీడీపీ కూడా ఆయనకు సహకరించలేదు. మరో వైపు వైసీపీ అయితే అసలు ఈ డిమాండ్ ని పట్టించుకోలేదు. మొత్తానికి స్టీల్ ప్లాంట్ ఇష్యూ మీద రాజీనామా చేసిన ఏకైక ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు చరిత్రలో నిలిచారు.గంటా శ్రీనివాసరావు అంతటితో ఊరుకోలేదు. స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఉన్న ఆముదాలవలసకు వెళ్ళి మరీ తన రాజీనామాను ఆమోచించుకోవాలి వత్తిడి తెచ్చారు. అది జరిగి కూడా నాలుగు నెలలు అయింది. కానీ ఇప్పటిదాకా గంటా శ్రీనివాసరావు రాజీనామా ఆమోదం పొందలేదు. అయితే స్పీకర్ ఫార్మెట్లో ఇచ్చిన ఆయన రాజీనామా అలాగే ఉంది. దాంతో గంటా శ్రీనివాసరావు కూడా సైలెంట్ అయ్యారు. ఈ లోగా కరోనా రెండవ దశ వీరవిహారం చేయడంతో అంతా ఆ ఊసు మరిచారు. అయితే ఇపుడు కేంద్రం దూకుడు పెంచేసింది. విక్రయ ప్రక్రియను తొందరలోనే పూర్తి చేయాలనుకుంటోంది.విశాఖకు జాతీయ వామపక్ష నాయకులు వస్తున్నారు. విశాఖ ఉక్కు విషయంలో ప్రైవేటీకరణ చేయవద్దని కూడా వారు గట్టిగా కోరుతున్నారు. ఉక్కు కార్మికులు అయితే భారీ ర్యాలీలు నిర్వహించి మరీ కేంద్రాన్ని హెచ్చరిస్తున్నారు. మరో వైపు ఢిల్లీ వెళ్ళి ఉద్యమించడానికి కూడా రంగం సిద్ధమవుతోంది. ఇంత జరుగుతున్నా కూడా గంటా శ్రీనివాసరావు మాత్రం ఎక్కడా ఒక్క మాట లేకుండా అలాగే ఉన్నారు. ఆయన కనీసం ఉక్కు పోరాట శిబిరం వైపుగా కూడా తొంగి చూడడంలేదు. మరి ఉక్కు కోసమే రాజీనామా చేశాను అని చెప్పిన ఆయన ఎందుకిలా ఉన్నారు అన్నది కార్మికులకే అర్ధం కావడంలేదు.గంటా శ్రీనివాసరావు పొలిటికల్ స్టంట్ కోసమే విశాఖ ఉక్కుని వాడుకున్నారా అన్న చర్చ కూడా ఉందిపుడు. ఉక్కు పోరాట యోధుడిగా కలరింగ్ ఇచ్చిన ఆయన క్లైమాక్స్ సీన్ లో కనిపించకపోవడం ఏంటి అని కూడా అంటున్నారు. ఇంకో వైపు చూస్తే ఉక్కు ఎటూ ప్రైవేట్ పరం అవుతుందని తెలిసే గంటా శ్రీనివాసరావు ఇలా మిన్నకున్నారా అన్న మాటా ఉంది. ఏది ఏమైనా ఆదికి ముందే అరవీర భయంకర వీరుడిగా అవతారం ఎత్తిన మాజీ మంత్రి సరైన టైమ్ లో కామప్ అయిపోవడం ద్వారా తన ఇమేజ్ ని బాగా తగ్గించేసుకున్నారు అన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి


# ముందుకు సాగని జగనన్న కాలనీలు

విజయవాడ, జూలై 14, (న్యూస్ పల్స్)జగనన్న స్మార్ట్ సిటల పేరిట ప్రభుత్వమే మౌలిక వసతులు కల్పించి "నో లాస్- నో ప్రాఫిట్" కింద మధ్య తరగతి ప్రజలకు ఇంటి స్థలాలను అమ్మాలని నిర్ణయించింది. లే అవుట్లకు నగరానికి మూడు కిలోమీటర్లలోపు దూరంలో భూములు కొనుగోలు చేయాలని భావించినప్పటికీ ప్రధాన నగరాలకు దగ్గర్లో అందుబాటులో భూములు లేని పరిస్థితి. విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖ, నెల్లూరు, ఒంగోలు నగరాలతో పాటు పలు మున్సిపాల్టీల్లో కూడా భూములు సేకరించడం అధికార యంత్రాంగానికి కష్టంగా ఉంది. భూముల సేకరణ ప్రక్రియ ఆలస్యమయ్యే కొద్దీ జగనన్న స్మార్ట్ సిటీలో లే అవుట్లు వేసే ప్రక్రియ మరింత వెనక్కు పోతోంది. ఒక్కో మున్సిపాల్టీలో 25నుంచి 150 ఎకరాల్లో వెంచర్ప్ వేయాలని ప్రభుత్వం భావించింది. భూములు సేకరించేందుకు ఆయా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ల సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా భూములు లభ్యత కాక పోతుండటంతో జిల్లా స్థాయి అధికారుల పరిస్థితి "కరవమంటే కప్పకు కోపాం విడవమంటే పాముకు కోపం" అనే చందాన తయారైంది. " నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు" పథకంలో అర్హులైన పేదలకు ఒక సెంటు స్థలం ఇవ్వడానికే భూ సేకరణ కష్టంగా మారగా, నగరం, మున్సిపాలిటీ పరిధిలో భూములు సేకరించడం తలకు మించిన భారమని అధికారులంటున్నారు.ఏప్రిల్ నెలలో ఈ పథకానికి రూపకల్పన జరగ్గా ఈ పథకానికి సంబంధించి ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదని సమాచారం. అర్హులైన మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంబంధించి ఎంత మందికి లే అవుట్లలో ప్లాట్లు అవసరమో గుర్తించేందుకు వార్డు వాలంటీర్లు, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ విభాగంలోని సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి డిమాండ్‌ను ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి రెండున్నర నెలలు దాటినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క నగరంలోకూడా లే అవుట్లకు శ్రీకారం చుట్టిన దాఖలాల్లేవు. ప్రభుత్వం అనుకున్నట్లు భూములు కొనుగోలు ప్రక్రియ పూర్తయితే ఎంఐజి(మధ్య తరగతి లే అవుట్ పథకం)లోని మూడు కేటగిరీలకు వారి వార్షిక ఆదాయాన్ని బట్టి లే అవుట్లలో ప్లాట్లను కేటాయిస్తారు. కనీసం దసరా నాటికైనా ప్లాట్లు మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి వస్తాయో లేదోననే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

# ముంపులో తూర్పు మన్యం

రాజమండ్రి, జూలై 14, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా మన్యంలోని లోతట్టు గిరిజన గ్రామాల ప్రజలు ముంపు భయంతో జీవనం సాగిస్తున్నారు. ఎగువన వర్షాలు కురవడం, గోదావరిలోకి నీరు చేరడం, కాఫర్‌డ్యామ్ కారణంగా బ్యాక్‌వాటర్ పెరగడంతో వారిలో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం కాఫర్‌డ్యామ్ బ్యాక్‌వాటర్ కారణంగా దేవీపట్నం మండలంలో ఇప్పటికే 17 గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. విఆర్‌పురం, కూనవరం మండలాల్లో పూర్తిస్థాయిలో పునరావాసం, పరిహారం అందకపోవడం, ఊరు ఖాళీ చేస్తే నష్టపోతామని నిర్వాసితులు అక్కడే ఉండిపోయారు.గతంలో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక వచ్చిన తరువాత ముందుగా దేవీపట్నం మండలంలో 32 వరకు గ్రామాలు ముంపునకు గురయ్యేవి. ప్రస్తుతం భద్రాచలం వద్ద 8 అడుగుల నీటిమట్టం నమోదుకే దేవీపట్నంలో పూడిపల్లి, కె.వీరవరం, తొయ్యేరు, మంటూరు, దేవీపట్నం, కచ్చులూరులో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇక భద్రాచలం వద్ద 43 అడుగులు వస్తే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉంది. దేవీపట్నం మండలంలో ముంపు గ్రామాలు 44 ఉన్నాయి. 5,168 బాధిత కుటుంబాలు ఉన్నాయి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఫలాలను కేవలం 3,055 కుటుంబాలు పొందాయి. మరో 2,563 కుటుంబాలకు ప్యాకేజీ అందాల్సి ఉంది. ఇప్పటికి 17 గ్రామాలు మాత్రమే ఖాళీ చేశారు. కూనవరం మండలంలో కూనవరం, శబరి, కట్టుగూడెం, కొండ్రాజుపేట, తాళ్లగూడెం, గుందువారిగూడెం, రాయిగూడెం, విఆర్‌పురం మండలంలో శ్రీరామగిరి, సీతంపేట, భైరవపట్నం, జీడిగుప్ప గ్రామాలనూ గోదావరి నీరు తాకింది. ప్యాకేజీ అందని కుటుంబాలన్నీ ముంపు గ్రామాల్లోనే ఉన్నాయి.ప్రస్తుతం వరదలను దృష్టిలో పెట్టుకుని శంఖవరం, పోతవరం, దామనపల్లి, ముసురుగుంట ప్రాంతాల్లో స్కూళ్లు, కళాశాలల్లో తాత్కాలిక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం. దేవీపట్నంలో 17 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించాం. మరో 27 గ్రామాలకు కల్పించాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికి ముసునుగుంట, పెదభీంపల్లి-3, నేలగోనెలపాడులో కాలనీలు పూర్తికానున్నాయి. మిగిలిన కాలనీలను సకాలంలో పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.మా గ్రామంలో 52 కుటుంబాలు ఉన్నాయి. గోదావరికి వరద రాకముందే గ్రామాన్ని నీరు చుట్టుముట్టింది. వారం రోజులుగా విద్యుత్ లేదు. దోమలు, పాములతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ ఎవరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందలేదు. ఇటీవల స్పెషల్ ఆఫీసర్ వచ్చి పోతవరం హాస్టల్‌లో తాత్కాలిక పునరావాసం కల్పిస్తామని చెప్పారు. శాశ్వత పునరావాసం, పరిహారం కల్పించాలి.

# మళ్లీ చక్రం తిప్పుతున్న బొత్స



విజయనగరం, జూలై 14, (న్యూస్ పల్స్)ఆయన సీనియర్ మంత్రి, వైసీపీ పాలనలో ఆయన బాగానే చక్రం తిప్పుతున్నారు. ముఖ్యంగా ఫైర్ బ్రాండ్‌కు కొంచెం తక్కువే అయినా బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు సంచలనాలు రేపుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్.. ఆపార్టీ నేతలపై విమర్శలు చేయడంలోనూ ఆయన దూకుడుగానే ఉన్నారు. ఇక, సీఎం జగన్ దగ్గర కూడా మంచి మార్కులు పొందారు. అయితే.. ఇంతగా మంచిమార్కులు కొట్టేసి.. ప్రభుత్వ వాదనను బలంగా వినిపిస్తున్నా బొత్స సత్యనారాయణకు రావాల్సిన పేరు రావడం లేదు.. ఆయనకు దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు. ఇక ఆయన కుటుంబం మాత్రం నిర్వేదంలో ఉంది. మా పరిస్థితి ఏంటి ? మాఫ్యూచర్ ఏంటి ? అని వారు తల పట్టుకుంటున్నారు.జగన్ కేబినెట్‌లో బొత్స సత్యనారాయణ కీలకంగా ఉన్నారు. విజయనగరం జిల్లాతో పాటు ఉత్తరాంధ్రలోనూ ఆయనకు మంచి పలుకుబడి ఉన్న విషయం తెలిసిందే. గతంలో వైఎస్ హయాంలోనూ మంత్రిగా వ్యవహరించారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగానూ ఆయన చక్రం తిప్పారు. ఇక, తర్వాత వైసీపీలో చేరారు. ఇక, కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు తనకు, తన కుటుంబానికి కూడా టికెట్లు ఇప్పించుకున్నారు. తన సతీమణి ఝాన్సీకి ఎంపీ టికెట్ ఇప్పించుకుని బొత్స సత్యనారాయణ గెలిపించుకున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రి పదవి కోసం కూడా ట్రై చేశారు. అయితే.. అది రాకపోయినా.. ఎంపీగా మాత్రం మంచి గుర్తింపు సాధించారు.ప్రస్తుతం బొత్స సత్యనారాయణ సోదరుడు.. ఇతరత్రా వ్యక్తులను తీసేసినా బొత్స సత్యనారాయణ సతీమణి, ఆయన కుమారుడు రాజకీయాల్లో మళ్లీ రీ యాక్టివ్ అయ్యేందుకు రెడీగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో బొత్స ఝాన్సీ.. మళ్లీ ఎంపీగా పోటీ చేసేం దుకు రెడీ అవుతున్నారు. అదే సమయంలో బొత్స సత్యనారాయణ కుమారుడు కూడా తాను పోటీకి రెడీగా ఉన్నానని సంకేతాలు పంపుతున్నారు. ఒకప్పుడు రాష్ట్ర స్థాయిలో బొత్స మంత్రిగా ఉన్నా విజయనగరం జిల్లాలో చీమ చిటుక్కుమన్నా ఆయనకు తెలియాల్సిందే. అలాంటిది ఇప్పుడు వైసీపీ అధిష్టానం బొత్స సత్యనారాయణను అన్ని విధాలా వాడుకుంటున్నా ఆయనకు సీన్ లేకుండా చేసిందట.విజయనగరం సిటీలో ఎమ్మెల్యే కోలగట్ల మాటే చెల్లుబాటు అని జగన్ చెప్పేశారట. అటు రాజన్నదొర, పుష్ప శ్రీ వాణి నియోజకవర్గాల్లో బొత్స సత్యనారాయణ మాట చెల్లడం లేదు. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో మళ్లీ చక్రం తిప్పి తనకు కావాల్సిన వాళ్లకే జిల్లా అంతటా టిక్కెట్లు ఇప్పించుకోవాలని చూస్తోన్న బొత్స సత్యనారాయణకు ఈ సారి అంత సీన్ ఉండదనే అంటున్నారు. ఇప్పుడే బొత్స మాటకు విలువలేదు.. ఇక ఎన్నికల వేళ ఆయన చెప్పినట్టు చేయడం కల్లే అంటున్నారు. అందులోనూ జగన్ దగ్గర ఇలాంటి యవ్వారాలు కుదరవ్..! ఈ క్రమంలోనే బొత్స సత్యనారాయణ భార్య ఎంపీ సీటు ఆశలు, బొత్స కుమారుడు పొలిటికల్ ఎంట్రీ ఆశలు నెరవేరవేమోనన్న గాబారా అయితే ఆ కుటుంబానికి ఉందన్నదే ఇప్పుడు స్థానికంగా వినిపించే టాక్ ?

## జనం నాడి పట్టుకొనే పనిలో తమ్ముళ్లు

గుంటూరు, జూలై 14, (న్యూస్ పల్స్)తమ్ముళ్లకు సూచన అంటూ.. కొన్ని విశ్లేషణలు వస్తున్నాయి. వీటిలో ప్రధానంగా.. ఆసక్తిగా ఉన్నది ఏంటంటే.. జగన్‌మీద కన్నా.. జనం మీద దృష్టి పెట్టాలనే విషయం. ఎందుకంటే.. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా.. సీఎం జగన్ ఎక్కడా పట్టించుకోవడం లేదు. ప్రజలకు తాను ఏం చేయాలని అనుకున్నాడో.. అది చేస్తున్నాడు. ఎంత మొత్తం నిధులు ఇవ్వాలని అనుకున్నాడో.. అంత మొత్తం ఇస్తున్నారు. దీంతో ప్రజల్లో ముఖ్యంగా పేదలు, దిగువ మధ్యతరగతి.. మహిళలు, చేతి వృత్తుల వారిలో జగన్‌పై సానుభూతి మరింత పెరుగుతోంది. సో.. తను పెట్టుకున్న వచ్చే ఎన్నికల టార్గెట్ నెరవేర్చుకునేందుకు జగన్ ఇలా వ్యవహరిస్తున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. జగన్ ఓటు బ్యాంకు రాజకీయాల దెబ్బతో టీడీపీ అతలాకుతలం అయిపోతోంది.ఈ కారణంగానే జగన్.. ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేస్తామని.. మాకు మంత్రి పదవులు ఖాయమని అనుకుంటున్న టీడీపీ నేతలకు మాత్రం.. ఈ తరహా వ్యూహం కనిపించడం లేదు. అంటే.. ఎంతసేపూ.. జగన్‌ను టార్గెట్ చేస్తున్నారు. నాయకుడు ఏ రూట్లో వెళుతున్నాడో.. ఆ పార్టీ నాయకులు అదే ఫాలో అవుతున్నారు. జగన్ రాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు తీసుకురావడం లేదు. ఆయన వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదు. ప్రత్యేక హోదా లేదు.. ఆయన చేతకాని సీఎం. ఇలా.. అనేక వ్యాఖ్యలు సంధిస్తున్నారు. సీఎం జగన్‌ను టార్గెట్ చేశామని.. ఆయన ప్రజల్లో ఇమేజ్ కోల్పోతున్నారని.. టీడీపీ నేతలు చెప్పుకొంటున్నారు.కానీ, వాస్తవంలోకి వస్తే.. ప్రజలు.. ఎవరూ కూడా రాష్ట్ర అభివృద్ధి కేవలం జగన్‌తోనే ఆగిపోయిందని.. ఆయన వల్లే పెట్టుబడులు రాకుండా పోయాయని అనుకునే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు అనుసరించిన తీరును ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. అదేసమయంలో గతంలో అమలు చేసిన పథకాల్లో రెండు మూడు వేలకు మించి ఒకే సారి పది వేలు, 15 వేలు. 18 వేల చొప్పున ఖాతాల్లో పడిన దాఖలా కూడా లేదు. దీంతో ప్రజలకు జగన్‌పై వ్యతిరేకత లేకపోగా.. ఆయనపై సానుభూతి పెరిగిందనేది వాస్తవం అంటున్నారు పరిశీలకులు. ఈ క్రమంలో టీడీపీ నేతలు.. జగన్‌ను టార్గెట్ చేస్తూ..నే మరోపక్క, జనం నాడిని పట్టుకునే ప్రయత్నం చేయకపోతే.. ఉపయోగం ఉండదని అంటున్నారు. మరి ఇప్పటికైనా.. వాస్తవం ఏంటో తమ్ముళ్లు తెలుసుకుంటారో లేదో చూడాలి.

## ఏపీ వైపు కన్నెత్తి చూడని టాలీవుడ్

విజయవాడ, జూలై 14, (న్యూస్ పల్స్)మొత్తానికి రెండేళ్ళ తరువాత జగన్ కి తత్వం బోధపడిందిట. టాలీవుడ్ ని ఎంత పిలిచినా ఏపీకి రావడం లేదు. పైగా వారంతా తారలు. ఎక్కడో సదూర ఆకాశంలో అలా మెరుస్తూ ఉంటారు. వారు అన్నింటికీ అతీతులు. దాంతో ఏపీ సీఎం గా జగన్ బాధ్యతలు చేపట్టాక ఒకే ఒక్క భేటీ తప్ప ఏపీలో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి విషయంలో అడుగు ముందుకు పడలేదు. పైగా ఎంతసేపూ కేసీయార్ కి బాసటగా నిలుస్తూ హైదరాబాద్ కే ప్రయారిటీ ఇవ్వడం కూడా జగన్ కి ఆగ్రహం తెప్పించింది అంటున్నారు.టాలీవుడ్ ని దారిలోకి తెచ్చుకోవడం కోసమే జగన్ వకీల్ సాబ్ టికెట్ల విషయంలో అతి పెద్ద షాక్ ఇచ్చారని అంటున్నారు. ఇప్పటిదాకా పెద్ద హీరోల సినిమాలకు ఇష్టారాజ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెంచుకునే ఛాన్స్ ఉండేది. దాన్ని ప్రభుత్వం అనుమతించింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సంబంధం లేకుండా తమ కలెక్షన్ల పంట పండించుకుంటున్నారు. అదే సమయంలో ఏపీ సర్కార్ అంటే పెద్దగా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికి చెక్ పెడుతూ జగన్ ప్రభుత్వం తీసుకున్న ఒకే ఒక చర్యతో ఇపుడు టాలీవుడ్ వెంట పడుతోంది.తాజాగా ఏపీ సర్కార్ ఒక జీవో విడుదల చేసింది. దాని ప్రకారం చూస్తే పెద్ద బడ్జెట్ సినిమాల విషయంలో రేట్లు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వాలంటే ప్రభుత్వ పెద్దలని తప్పనిసరిగా కలవాల్సిందే. ఇది ప్రతీ సినిమా విషయంలోనూ చేయాల్సిందే. అంటే ఏ హీరోకు ఆ హీరో ఇక మీదట సర్కార్ పెద్దలతో బాగా టచ్ లో ఉండాలన్న మాట. లేకపోతే మామూలు ధరలే అమలవుతాయి. ఇక టాలీవుడ్ లో చూసుకుంటే అన్నీ హై బడ్జెట్ మూవీస్ గా వస్తున్నాయి. పాన్ ఇండియా సినిమాలు కూడా ఉన్నాయి. దాంతో జగన్నామస్మరణతో టాలీవుడ్ ఇపుడు తరిస్తోంది.జగన్ అపాయింట్మెంట్ కోసం ఇపుడు టాలీవుడ్ బడా బాబులు క్యూ కడుతున్నారుట. సినిమా పరిశ్రమ సమస్యలు చర్చించాలి అని అర్జీలు పెట్టుకుంటున్నారు. అయితే జగన్ ఇపుడు అపాయింట్మెంట్ ఇచ్చినా తాను అనుకున్న దాని నుంచి వెనక్కు పోరు అంటున్నారు. బడా సినిమాలు, పెద్ద హీరోల విషయంలో జీవో ఆధారంగానే రేట్ల పెంపు అమలుకే సర్కార్ కట్టుబడి ఉందని అంటున్నారు. అలా చేస్తేనే టాలీవుడ్ ఏపీ వైపు చూస్తుంది. ఇక్కడ జనాలతో కనెక్షన్లు కూడా బాగుంటాయని భావిస్తున్నారుట. మొత్తానికి జగన్ గట్టి నిర్ణయంతో టాలీవుడ్ విలవిలలాడుతోంది మరి.

## కరివేపాకులా మాదిరిగా రఘురామకృష్ణరాజు...

ఏలూరు, జూలై 14, (న్యూస్ పల్స్)ఏదైనా తెగేదాకా లాగ కూడదంటారు. అలాగే అతి వెగటు కూడా పుట్టిస్తుందంటారు. ఇప్పుడు వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణరాజు విషయంలో అదే జరుగుతుంది. ఏదైనా కొంతకాలమే సమయం నడుస్తుంది. అది ఎవరికైనా అదే వర్తిస్తుంది. రఘురామ కృష్ణరాజు ఎవరో తన వెనకున్నారన్న భ్రమలో ఉన్నారు. కాలం కలసి రాకపోతే వారు కనీసం ఇటువైపు కూడా చూడరు. ఆ సంగతి తెలియని ఆయన రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. రాజుగారి లేఖలు, ఆయన వ్యవహారశైలి పట్ల సొంత నియోజకవర్గం నర్సాపురం పార్లమెంటు ప్రజలతో పాటు సొంత సామాజికవర్గం సయితం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.వైసీపీ టిక్కెట్ మీద విజయం సాధించిన రఘురామ కృష్ణరాజు ఆ పార్టీ అధినేత వైఖరి నచ్చకపోతే బయటకు వచ్చేయాలి. తాను పుడింగిననుకుంటే మళ్లీ పోటీ చేసి గెలవాలి. అంతేతప్ప ఒక పార్టీ మీద గెలిచి అదే పార్టీని, ఆ పార్టీ అధినేతను పదేపదే విమర్శించడం సరికాదు. మొన్నటి దాకా రఘురామ కృష్ణరాజుకు తెలుగుదేశం పార్టీ వెన్నుదన్నుగా ఉండేది. ఆ పార్టీ సోషల్ మీడియా సయితం రఘురామ కృష్ణరాజుకు అండగా నిలిచింది.కానీ రానురాను రఘురామ కృష్ణరాజు వైఖరి విసుగుపుట్టిందేమో ఆయనను వదిలేశారు. ఇక భారతీయ జనతా పార్టీ అండ ఉందని రఘురామ కృష్ణరాజు భావిస్తున్నారు. పదే పదే కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. కానీ బీజేపీ పరిస్థితి ఆయనకు తెలియంది కాదు. తమకు అవసరం లేదనుకుంటే కరివేపాకులా తీసిపారేస్తుంది. ఇపుడు బీజేపీకి రఘురామ కృష్ణరాజు అవసరం కన్నా జగన్ అవసరమే ఎక్కువగా ఉంది. అది తెలియని రఘురామ కృష్ణరాజు కాలు దువ్వుతున్నారు.అంతా సవ్యంగా జరిగితే మరో మూడేళ్లు మాత్రమే రఘురామ కృష్ణరాజు కు పదవి ఉంటుంది. ఆ తర్వాత పరిస్థితి ఏంటన్నది రఘురామ కృష్ణరాజు అర్థం కావాలి. ఆయన మామూలు రాజకీయ నేత కాదు. పారిశ్రామికవేత్త కూడా. బ్యాంకు రుణాల ఎగవేత కేసులున్నాయి. సీబీఐ, ఈడీలు ఇప్పటికే సోదాలు నిర్వహించాయి. ఏమాత్రం జగన్ గట్టిగా నొక్కితే పాత కేసులు బీజేపీ ప్రభుత్వం తిరగదోడే అవకాశం లేకపోలేదు.

# ఫైర్ బ్రాండ్ కు తప్పని అవస్థలు

తిరుపతి, జూలై 14, (న్యూస్ పల్స్)వైసిపి ఫైర్ బ్రాండ్, డేరింగ్ లేడీ.. ఎమ్మెల్యే ఆర్కె.రోజాను వైసిపి అధిష్టానం పక్కన పెడుతోందా? గత కొంత కాలంగా పార్టీలో ఆమెకు ప్రాధాన్యత సన్నగిల్లిందా? నగరి నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న గ్రూపు రాజకీయాలను చూస్తుంటే.. అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. గత రెండు సాధారణ ఎన్నికల్లోనూ నగరి నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున ఎమ్మెల్యేగా రోజా ఎన్నికయ్యారు. వైసిపి ప్రతిపక్ష హోదాలో ఉన్న సమయంలోనూ.. గత ఎన్నికల్లో ప్రచారంలోనూ.. వైసిపి అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనూ ప్రతిపక్ష నేతలపై మాటల తూటాలు పేల్చుతూ ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న సమయంలోనూ, ప్రతిపక్ష హోదాలో ఉన్న సమయంలోనూ, ఆయనతోపాటు ఆ పార్టీ నేతలను సైతం ఉక్కిరిబిక్కిరి చేసేలా రోజా వ్యాఖ్యలు ఉండేవి. ఎలాంటి బెరకూ లేకుండా మీడియా ముందే తీవ్ర స్థాయిలో విరుచుకుపడేది. అలాంటి సమయంలో అధికారంలోకి వచ్చిన వైసిపి.. రోజాకు మంత్రి పదవి కట్టబెడుతుందని అందరూ ఊహించారు. అయితే, అందరి ఊహలను పటాపంచలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆమెను తన మంత్రి వర్గంలోకి తీసుకోలేదు. ఎపిఐఐసి చైర్మన్ పదవితో సరిపెట్టారు. అయితే, వైసిపి ఫైర్ బ్రాండ్‌గా పేరొందిన రోజా.. గత కొంత కాలంగా ప్రతిపక్ష టిడిపిపై ఒకప్పటిలా కాకుండా అప్పుడప్పుడు అడపాదడపా వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. రోజాకు అధిష్టానం సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే కొంత కాలంగా ఆమె ఆచీతూచీ నడుచుకుంటున్నారనే వార్తలు వచ్చాయి. ఇటీవల ఎపిలో జరిగిన కార్పొరేషన్, జెడ్‌పిటి, ఎంపిటిసి ఎన్నికల సమయంలో నగర నియోజకవర్గంలో వర్గ బేధాలు బయటపడ్డాయి. తాను నిలబెట్టిన అభ్యర్థులను ఓడించేందుకు ఆ వర్గం పనిచేసిందంటూ రోజా ఆరోపిస్తూ వచ్చారు. అంతేకాదు, ఆ వర్గం సాధారణ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా పనిచేయడం వల్లే తక్కువ మెజారిటీ వచ్చిందని కూడా చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా, రోజా వైసిపి ఫైర్ బ్రాండ్ అయినా.. డేరింగ్ లేడీ అయినా.. నియోజకవర్గంలో ఆమెకు అంత సీన్ లేదంటూ ఆ వర్గం ఎప్పటి నుంచో చెప్పుకొస్తుంది. తాజాగా వైఎస్ జయంతి వేడుకల్లోనూ రోజా వర్సెస్ శాంతి గ్రూప్ అంటూ రెండు గ్రూపులుగా వైఎస్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఈ రెండు గ్రూపుల మధ్య నడుస్తున్న వార్ మరోసారి బట్టబయలైంది. ఇదిలా ఉండగా, నియోజకవర్గ స్థాయిలో అయినా, రాష్ట్ర స్థాయిలో అయినా.. ఏదైనా కార్పొరేషన్ పదవికి చైర్మన్‌ను నియమించాలంటే ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అభిప్రాయం తీసుకుంటారు. అయితే, నగరిలో ఎమ్మెల్యే రోజా ఉన్నప్పటికీ ఆమెతో ఏమాత్రం పొసగని లోకల్ పాలిటిక్స్‌లో మంచి పట్టున్న కెజె కుమార్ భార్య శాంతికి ఇటీవల ఈడిక కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయంతో పార్టీలో రోజాకు ఇచ్చే ప్రాధాన్యత క్రమంగా తగ్గిపోయిందంటూ ప్రచారం జరుగుతోంది. మొదటి నుంచి కెజె కుమార్ వైసిపిలో జగన్‌కు దగ్గర మనిషిగా పనిచేస్తున్నారు. కెజె కుమార్ భార్య శాంతి ఇది వరకే మున్సిపల్ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా పనిచేశారు. ఈ కారణాలతో కెజె కుమార్‌ను అధిష్టానం ప్రోత్సహిస్తోందనే వార్తలూ వినిపిస్తున్నాయి.

# 22న పార్లమెంట్ వెలుపల శాంతియుత నిరసన : బీకేయూ




న్యూఢిల్లీ : ఈ నెల 22న పార్లమెంట్ వెలుపల శాంతియుతంగా నిరసన చేపట్టనున్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) నేత రాకేశ్ తికాయిత్ పేర్కొన్నారు. 19వ తేదీ నుంచి ఆగస్ట్ 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం రాకేశ్ తికాయిత్ మాట్లాడుతూ రిపబ్లిక్ దినోత్సవం రోజున చేపట్టిన ట్రాక్టర్ ర్యాలీ సందర్భంగా హింస చెలరేగినా.. ప్రస్తుతం శాంతియుతంగా పార్లమెంట్ వెలువల నిరసనకు కూర్చుంటామన్నారు. లోపల సభ కొనసాగుతుందన్నారు. 200 మంది రైతులు బస్సులో పార్లమెంట్‌కు వెళ్తారని, ఛార్జీలను సైతం తామే చెల్లిస్తామన్నారు. గతేడాది అమలులోకి వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధానికి సరిహద్దుల్లోని వివిధ ప్రాంతాల్లో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. కేంద్రంతో పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ కొలిక్కి రాలేదు.

# వాళ్లకి నామినేటెడ్ పోస్టులు

విజయవాడ, జూలై 14, (న్యూస్ పల్స్) ఏపీలో నామినేటెడ్ పదవుల ప్రకటనకు సర్వం సిద్ధమైంది. దాదాపుగా నామినేటెడ్ పద'వుల ఎంపిక కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. 60 నుంచి 70 వరకు కార్పొరేషన్లకు ఛైర్మన్ల ప్రకటనకు అవకాశం ఉండగా.. గత ఎన్నికల్లో ఓటమి పాలైన, పలు కారణాలతో టికెట్ పొందని వారికి తొలి ప్రాధాన్యత ఉందనున్నట్లు తెలుస్తోంది. వీఎంఆర్ డీఏ చైర్మన్ గా అక్కరమాని విజయ నిర్మల అని .. రాష్ట్ర విద్యావిభాగం వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అని.. అలాగే.. నెడ్ క్యాప్ చైర్మన్ గా ప్రతి పాదనలో కేకే రాజు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ ఛైర్మన్ గా దాడి రత్నాకర్ అని.. విశాఖ రీజియన్ పెట్రోకారిడార్ చైర్మన్ గా మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ ?! అని సమాచారం. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రముఖ ఆడిటర్ జీవి అని ప్రచారం జరుగుతుండగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా చింతకాయల సన్యాసిపాత్రుడును నియమించనున్నారు. డీసీఎమ్ ఛైర్ పర్సన్ గా పల్లా చినతల్లి అని.. రాష్ట్ర బ్రాహ్మణ విభాగం చైర్మన్ గా సుధాకర్ అని సమాచారం. డీసీసీబీ ఛైర్మన్ గా సుకుమార్ వర్మ కొనసాగింపునకు అవకాశం ఉండగా.. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గా గుంటూరు జిల్లాకు చెందిన నేతకు ఛాన్స్ ఇక్కే అవకశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# రేషన్ కోసం తిప్పలు

కొత్తగూడెం జూలై 14, (న్యూస్ పల్స్)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మర్రిగూడెం పంచాయితీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారికి ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న సరుకులు తీసుకునేందుకు ప్రతినెల రేషన్ షాప్ కి వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. ఇల్లందు ప్రాంతం నుండి డీలరు రావడం ఒక ఎత్తు అయితే ప్రయాణానికి ఇబ్బందులు పడుతూ వచ్చిన సిగ్నల్ సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది సిగ్నల్ కోసం 56 కిలోమీటర్ల వెళ్లాల్సిన పరిస్థితి అయినప్పటికీ సిగ్నల్ సమస్య కారణంగా రేషన్ అందక పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధులకు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని రేషన్ షాప్ కు వస్తున్న లబ్ధిదారులు వాపోతున్నారు... మరో వైపు రేషన్ షాప్ నిర్వహణ కోసం సరుకులకు ఇబ్బందులే కాక ఆన్లైన్ పాఠశాల విద్యార్థులకు కూడా కష్టాలు తప్పడం లేదు.

# వేగవంతమయిన పోలవరం పనులు

పోలవరం జూలై 14, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం ప్రాజెక్ట్ సాకారం దిశగా అడుగులు వేస్తోంది. పనులు వేగంగా జరుగుతున్నాయి. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసేలా ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి , జలవనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, జలవనరుల శాఖ అధికారుల సహకారం, పర్యవేక్షణతో పనులు ప్రకృతి విపత్తులను ఎదుర్కొ ని ముందుకు సాగుతున్నాయి. ఒకవై పు భారీ వరదలు,మరోవైపు కలవర పెడుతున్న కరోనా... కానీ పోలవరం ప్రాజెక్ట్ పనులు మాత్రం రెట్టింపు వేగంతో ఊపందుకున్నాయి. మేఘా ఇంజనీరింగ్ సంస్థ పక్కా ప్రణాళికకు తోడు ప్రభుత్వం, అధికారుల సహకారంతో పోలవరం ప్రాజెక్ట్ లో అంచనాలను మించి పనులు జరుగుతున్నాయి. పోలవరం పనులు మేఘా సంస్థ చేపట్టిన తరువాత వేగం పుంజుకుంది. సీఎం ఆదేశాలు, అధికారుల సహకారం, ఎంఈఐఎల్ సంస్థ వేగం వెరశి పోలవరం నిర్మాణం ఉరుకులు, పరుగులు పెడుతున్నా యి.

# అప్పన్నను దర్శించుకున్న హరిబాబు

విశాఖపట్నం జూలై 14, (న్యూస్ పల్స్)మిజోరం నూతన గవర్నర్ గా నియమితులైన కంభంపాటి హరిబాబు సతీ సమేతంగా .. సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు డీఈఓ సూజత గారు, ఏఈఓ రాఘవ కుమార్, ట్రస్టుబోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు ఘన స్వాగతం పలుకుతూ, వేద పండితులు ఆశీర్వాదం అందించారు. తనను గవర్నర్ గా నియమించినందుకు... రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ , ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు హరిబాబు. ఈశాన్య రాష్ట్రాల్లోని మిజోరం ప్రగతికోసం స్వామివారి ఆశీస్సులు కోరారనని హరిబాబు తెలిపారు. స్వామివారి ఆశీస్సులు తీసుకెళ్లడానికే సింహాచలం వచ్చానని చెప్పుకొచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ... మన సింహాచలం శ్రీవరాహనరహసింహస్వామన్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను హరిబాబుకు అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు వివరించారు.

# పట్టపగలే దోపిడికి యత్నం

ఏలూరు జూలై 14, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా ఉంద్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో పట్టపగలు దారి దోపిడికి దుండగులు ప్రయత్నించారు. డ్వాక్రా సత్యవతి గ్రూప్ లీడర్లు స్థానిక ఇండియన్ బ్యాంక్ నుండి 9 లక్షల రూపాయల లోన్ నగదు తీసుకోని వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు వారిని వెంబడించి నగదు అపహరించే ప్రయత్నం చేశారు. డబ్బు సంచి లాక్కునే ప్రయత్నంలో 50వేల రూపాయలు చేజిక్కించుకున్నారు. ఇంతలో స్థానికులు రావడంతో అక్కడి నుండి ఇద్దరు యువకులు పరారయ్యారు. మహిళలును వెబడించి, వారు పారిపోయే దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు

### జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడిన వ్యాను

శ్రీకాకుళం జూలై 14, (న్యూస్ పల్స్)శ్రీకాకుళం జిల్లా పలాస మున్సిపాలిటీ పరిధి మొగిలిపాడు సమీపంలో జాతీయ రహదారి మైలురాయి 523/500 వద్ద బ్రిడ్జి పై ఓ లగేజీ వ్యాను అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు గాయాలుకాగ విషయం తెలుసుకున్న 1033 నేషనల్ హైవే సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో పలాస ఆసుపత్రికి తరలించి, క్రైన్ సహాయంతో వాహనాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

# కంసాలిపాలెం, మాధవరం గ్రామాల మధ్య పూర్తిగా నిలిచిపోయిన రాక పోకలు

ఏలూరు జూలై 14, (న్యూస్ పల్స్)పశ్చిమగోదావరిజిల్లా నిడదవోలు మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నిడదవోలు మండలం కంసాలిపాలెం, తాడేపల్లి గూడెం మండలం మాధవరం గ్రామాల మధ్య పూర్తిగా రాక పోకలు నిలిచిపో యాయి.గత ఏడాది భారీగా కురిసిన వర్షాలకు ఎర్రకాలువ ఒక్కసారిగా ఉప్పొంగడంతో భారీగా వరద నీరు చేరి ఎర్రకాలువ వంతెన సగ భాగం పూర్తిగా కుప్పకూలిపోయింది. ఈ ఇరు గ్రామ మధ్య ఉన్న ఎర్రకాలువ వంతెన..సగం తాడేపల్లి గూడెం నియోజకవర్గంలోనూ, సగం నిడదవోలు నియోజకవర్గంలోనూ ఉండడంతో ఇరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వంతులు వేసుకుంటు న్నారని ప్రజలు వాపోతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ, నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడులు ఎర్ర కాలువ వంతెన కూలినప్పుడు హుటాహుటిన వచ్చి పరిశీలించి బ్రిడ్జి ని వెంటనే నిర్మిస్తామని హామీ ఇచ్చి, తరువాత ఇటు వైపు కూడా చూడడం లేదని ఇరు గ్రామాల ప్రజలు గగ్గోలు పెడు తున్నారు.నిడదవోలు, తాడేపల్లి గూడెం నియోజకవర్గ ఎమ్మెల్యేలు, అధికారులు పట్టించు కోకపోవడంతో ప్రత్యాయమనంగా తాత్కాలికనీగా ఎర్రకాలువలో తూరలతో రోడ్డును నిర్మించుకున్న రైతులు.గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు నిర్మించుకున్న తాత్కాలిక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమి ట్టాడుతున్నారు.తాత్కాలిక రోడ్ కొట్టుకు పోవడంతో కంసాలిపాలెం, మాధవరం గ్రామాల మధ్య పూర్తిగా రాకపోకలు నిలిచి పోవడంతో వేరే దారి గుండా ప్రయాణం కొనసాగించడం ఇక్కడి ప్రజలకు రైతులకు కష్ట తరంగా మారింది. 25 కిలోమీటర్ల చుట్టూ తిరిగి ప్రయాణం చేసి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరు నియోజకవర్గ శాసన సభ్యులు చొరవ తీసుకుని వెంటనే స్పందించి ఎర్రకాలువ పై వంతెన నిర్మించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# వారం రోజుల్లోనే ఆయనకు నోటీసు రావొచ్చు

### 290 పేజీల డాక్యుమెంట్ తో ఫిర్యాదు
### ఎంపీ, వైయస్సార్ సిపి పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్

రాజమహేంద్రవరం జూలై 14, (న్యూస్ పల్స్) పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎంపీ రఘురామ కృష్ణంరాజుకు వారం రోజుల్లోపే స్పీకర్ నోటీసును ఇచ్చే అవకాశాలు ఉన్నాయని రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్విప్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా గుర్తుపై విజయం సాధించిన రఘురామకృష్ణంరాజు పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనేది స్పష్టంగా సాక్ష్యాలు ఉన్నాయని, ఇందుకు సంబంధించి సుమారు 290 పేజీలతో కూడిన డాక్యుమెంట్ను తమ పార్టీ పక్షాన స్పీకర్కు అందించడం జరిగిందని తెలిపారు. ఎప్పుడయితే పార్టీ విధానాలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారో అప్పుడే ఆయన పదవికి డిస్క్వాలిఫై అయినట్లేనని అన్నారు. తాము ఇచ్చిన సాక్ష్యాలను ఆధారంగా చేసుకుని స్పీకర్ ఆయనకు మరో వారం రోజుల్లోపే నోటీసు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని, అనంతరం స్పీకర్కు ఉన్న విశేష అధికారాన్ని ఉపయోగించి ఆయన ఎంపీ పదవిని రద్దు చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

# ప్రజల పై పెట్రో బాంబు

### అడ్డు, అదుపు లేని పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదల
### ఎపిసిసి అధ్యక్షులు డా.సాకే శైలజానాథ్

మచిలీపట్నం జూలై 14, (న్యూస్ పల్స్) ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్న కూడా మన దేశం లో పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకి పెరుగుతూనే పోతున్నాయని, ప్రజా దోపిడీలో ప్రపంచపటం లో మన దేశాన్ని ముందు నిలబెట్టాలని తాపత్రయంలో కేంద్ర ప్రభుత్వం వున్నదని ఎపిసిసి అధ్యక్షులు డా.సాకే శైలజనాథ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. కరోనా ధాటికి అల్లాడిపోతున్న జీవితాలను సరిదిద్దవలసినది పోయి వారిపై ఇంకా భారం వేయడం దారుణమన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా బుధవారం మచిలీపట్టణం పార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు లాం తాంతియా కుమారి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శైలజనాథ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. అసమర్ధ నాయకత్వంలో, అనాలోచిత నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థను సర్వ నాశనం చేసిన మోడీ ప్రభుత్వం, ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి ప్రజల పొట్ట కొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా మన దేశం లో పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్నాయని, దానికి కేంద్ర ప్రభుత్వ దోపిడీ విధానాలే కారణమని అన్నారు. ప్రజలపై అధిక మొత్తంలో పన్నులు విధిస్తూ పెట్రోల్ డీజిల్ ధరలను చరిత్రలో లేని విధంగా పెంచివేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ దోపిడీలో నా భాగం నాదే అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ తీరు ఉందని, వాళ్లకి ఏ మాత్రం తీసిపోని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పన్నులు వేస్తూ వారి జీవితాలను దుర్భరం చేస్తున్నాయని విచారం వ్యక్తం చేసారు. పెట్రోల్, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వంతో పోటా పోటీగా పన్నులు వడ్డిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇది చాలదన్నట్లు చెత్త మీద కూడా పన్నులు వేసే దుస్థితికి వొచ్చిందన్నారు. అందినకాడికి ప్రజలను అన్ని రకాలుగా దోచుకునే ప్రభుత్వాన్ని ఎక్కడ చూడలేదని, కాంగ్రెస్ పార్టీ పేరును, తన తండ్రి రాజశేఖర్ రెడ్డి పేరును చెప్పుకుని అధికారం లోకి వచ్చిన జగన్ రెడ్డి, ప్రజా జీవితాలను గాలికొదిలేశారని, ఇటువంటి వ్యక్తి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా ఉండటం ప్రజల దురదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

# ధామి కూడా మూణ్నాళ్ల ముచ్చటేనా

డెహ్రాడూన్, జూలై 14, (న్యూస్ పల్స్)ఉత్తరాఖండ్ భారతీయ జనతా పార్టీ తీరును చూసిన తరవాత గతంలో వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు గుర్తుకు రాక మానదు. అసమ్మతి వ్యవహారాలు, ముఖ్యమంత్రుల మార్పులు, ఢిల్లీ చుట్టూ సీఎంల ప్రదక్షిణలు, కొన్ని సందర్భాల్లో అధిష్టానమే పరోక్షంగా అసమ్మతిని తెరవెనక నుంచి ప్రోత్సహించడం వంటివి అప్పట్లో సర్వ సాధారణం. దిగిపోయే సీఎం కొత్త ముఖ్యమంత్రి పేరును ప్రతిపాదించడం, మాజీ ముఖ్యమంత్రికి కేంద్రంలో రాజకీయ పునరావాసం కల్పించడం వంటివి చోటుచేసుకునేవి. మొన్నటికి మొన్న అసోం అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చిన ముఖ్యమంత్రి సర్బానంద సోనావాల్ ను కాదని గతంలో కాంగ్రెస్ నుంచి వలస వచ్చిన హిమంత బిశ్వ శర్మను కమలం పార్టీ కొత్త సీఎంను చేసింది. సోనావాల్ ను ఇప్పుడు కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇటు వంటి రాజకీయాలు తాత్కాలికంగా బాగున్నప్పటికీ భవిష్యత్తు ఎన్నికల్లో బీజేపీ విజాయవకాశాలను దెబ్బతీస్తాయనడంలో సందేహం లేదు. ఇప్పుడు పంజాబ్ లోనూ హస్తం పార్టీ దాదాపు అలాంటి రాజకీయాలనే చేస్తోంది. ఇక భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే ఉత్తరాఖండ్ విషయంలో అలానే చేసింది. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా పుష్కర్ సింగ్ ధామిని నియమించింది. దీంతో 2017 మార్చిలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీజేపీ నియమించిన మూడో ముఖ్యమంత్రిగా పుష్కర్ సింగ్ గుర్తింపు పొందారు. దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన యూపీని విభజించి 2000 సంవత్సరంలో కేంద్రంలోని అప్పటి వాజపేయి సర్కారు ఉత్తరాంచల్ రాష్ట్రం ఏర్పాటు చేసింది. తరవాత దానిని ఉత్తరాఖండ్ గా మార్చారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లకు భాజపా 57సీట్లతో ఘన విజయం సాధించింది. త్రివేంద్ర సింగ్ రావత్ ను డెహ్రాడూన్ అధికార పీఠంపై ఆశీనులయ్యారు. పార్టీలో నెలకొన్న తీవ్రమైన అసమ్మతి కారణంగా రావత్ ఈ ఏడాది మార్చిలో రాజీనామా చేశారుమార్చి 10న కొత్త ముఖ్యమంత్రిగా తీరథ్ సింగ్ రావత్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఎమ్మెల్యే కాదు. ఘర్వాల్ నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. సెప్టెంబరులోపు ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికవ్వాల్సి ఉంది. కరోనా కారణంగా ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం విముఖత చూపడంతో రావత్ అనివార్యంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. రావత్ పనితీరుపై పార్టీలో అసంతృప్తి నెలకొంది. ఆయన తన వివాదాస్పద వ్యాఖ్యలతో బీజేపీకి కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టారు. అంతర్గత విభేదాలను చక్కదిద్ద లేకపోయారు.

కరోనా సమయంలో కుంభమేళా నిర్వహణపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇవన్నీ రావత్ అధికార పీఠానికి ఎసరు పెట్టాయి. దీంతో కొత్త ముఖ్యమంత్రిగా పుష్కర్ సింగ్ ను పార్టీ నియమించింది. సింగ్ ముందు చాలా సవాళ్లే ఉన్నాయి. మరో ఏడెనిదిమినెలల్లో అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని ఏకతాటిపై నడిపించాల్సి ఉంది. వర్గ విభేదాలతో సతమతమవుతున్న బీజేపీని ఎన్నికలకు సిద్ధం చేయడం అంత తేలికైన విషయం కాదు.

# శిథిలావ్యవస్థకు చేరుకున్న ప్రధాన రహదారి

ఆచంట జూలై 14, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పరిధిలో ఉన్న పెనుగొండ ప్రధాన రహదారి శిథిల వ్యవస్థకు చేరుకుని ప్రయాణికులు పాలిట శాపంగా మారింది. పెనుగొండ ప్రధాన రహదారిని 2012 -2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వం సుమారు నాలుగున్నర కోట్లతో వన్ వేను టువేగా వేయడం జరిగింది. వేసిన కొన్ని నెలలో రోడ్డు పూర్తిగా శిథిల వ్యవస్థకు చేరుకుంది. అప్పటి నుండి ఆ రహదారికి మరమ్మత్తు పనులు చేస్తామని ప్రతి సారి సుమారు 8 లక్షల నుండి 10 లక్షలు పెట్టి తూ తూ మంత్రంగా రోడ్డుకు మర్రమత్తులు వేసి చేతులు దులుపుకుంటున్నారు అధికారులు .మార్టేరు నుండి పెనుగొండ వెళ్లాలంటే పది నిమిషాలు సమయం పడుతుంది, ఇపుడు ఆ రోడ్డు సరిగా లేకపోవడం తో 40 నిమిషాలు సమయం పడుతుంది. రోడ్డు బాగా గొతుకులతో ఉండడం తో ఎమర్జెన్సీ 108 వాహనాలో పేషంట్ లను సమయానికి హాస్పిటల్ కి అడ్మిన్ చేయలేకపోవడం కూడా పరిస్థితి ఏర్పడింది. అనేక మంది అదే రోడ్డులో మృత్యు వాతకు బలైపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెనుగొండ రహదారిని పటిష్టంగా వేసి ప్రయాణికుల ప్రాణాలను కోల్పోకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాహన ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పెట్రోల్ బంక్ లో కాంగ్రెస్ ధర్నా

నర్సాపురం జూలై 14, (న్యూస్ పల్స్) దేశం మొత్తం కరేనా తో పోరాడుతుంటే సామాన్యుడి నడ్డి తెరిచే లా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ పెంచిన రేట్లతో పోరాడుతున్నానని పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పట్టణ కాంగ్రెస్ నాయకుడు కానూరు బుజ్జి అన్నారు. ఈరోజు పట్టణంలో తిరిగిన పెట్రోల్ డీజిల్ ధరలను నియంత్రించాలని పెట్రోల్ బంక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. అని ఒక ప్రక్క కరోనా మరోపక్క పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లు మూలంగా నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటాయి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడిందని. లీటర్ పెట్రోల్ 107-40 రూ.పై లు అవడం మూలంగా రవాణా చార్జీలు కూడా పెరిగాయని పెంచిన ధరలు మూలంగా ప్రజలపై పెనుభారం పడుతుందని .కాబట్టి వెంటనే పెంచిన ధరలను నియంత్రించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నేతృత్వంలో పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ కార్మికులకు అండగా వైకాపా

విశాఖపట్నం జూలై 14, (న్యూస్ పల్స్)విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటు పరం కానివ్వం. కార్మికులకు అండగా వుంటామని ఎంపి ఎంవివి సత్యనారాయణ అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం విశాఖ స్టీల్ .త్యాగాలతో సాధించుకున్నది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి స్టీల్ ప్లాంట్ ప్రవేటైజేషన్ కాకుండా అన్నిప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కార్మికనాయకులతో ఎయిర్ పోర్టులో చర్చలు జరిపి...కేంద్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రి లెటర్స్ రాపారని అన్నారు. ఈ నెల 15 న ఎంపిలు అందరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తో సమావేశం అవుతున్ఆం. భవిష్యత్ కార్యచరణ పై ప్రణాళిక రూపోందిస్తామని అన్నారు.. కార్మికులు డిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయనున్నారు. ఈ రోజు సర్బ్యాటా హౌస్ లో రాజ్యసభసభ్యులు విజయసాయిరెడ్డి తో కార్మిక నాయకులు సమావేశం కూడా జరగనుంది. వైఎస్సార్ కాంగ్రేస్ పూర్తిగా విశాఖ ఉక్కును కాపాడేందుకు కార్మికులకు అండగా నిలుస్తుందని అయన అన్నారు.

# టీడీపీ నేతల ఆరెస్టు

పెందుర్తి గ్రామ వాలంటరీ ఫిర్యాదుపై టిడిపి నాయకులను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేసారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం గోరపల్లి పంచాయతీ కరక వాని పాలెం లో ఈ ఘటన చోటు చేసుకుంది. రోడ్డుపై రెండు ఆటోలు నిలిచి ఉండడంతో అటుగా వెళ్ళిన టిడిపి నాయకుడు చిరికి అవతారం , నిలిచి ఉన్న ఆటోలను పక్కకు తియమనడం తో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు గొడవ జరిగిన ప్రాంతానికి చేరుకొని టిడిపి నాయకులను అరెస్ట్ చేశారు.

# ఖాళీ పోస్టులు భర్తీ చేసే వరకు పోరాడుతాం

## -విద్యార్థి యువజన సంఘాలు

ఆదోని జూలై 14, (( విభారె) ) పట్టణంలో భీమ సర్కిల్ నందు ఎస్ఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసుల అధ్యక్షతన రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా , మాజీ డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మన్న ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 18వ తేదీ విడుదల చేసిన జాబ్ లెస్ జాబ్ క్యాలెండర్ ను రద్దు చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల 40 వేల ఉద్యోగాలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులను నట్టేట ముంచింది అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 24 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యార్థి యువజన సంఘాలు నాయకులు శ్రీనివాసులు , వీరేష్ , తేజ, రమేష్, తిరుమలేశ్ , గిరి , సోమశేఖర్ సూర్య మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసింది అని ఎద్దేవా చేశారు, నిరుద్యోగుల జోలికొస్తే జగన్మోహన్రెడ్డికి ఇంటిదారి తప్పదని వారు హెచ్చరించారు. వారిచ్చిన ఉద్యోగాల విప్లవంలో కేవలం 10143 ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ లో పెట్టి విప్లవం అంటే ఏ విధంగా విప్లవం అవుతుందని ప్రశ్నించారు. కావున నిరుద్యోగులు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 40 వేల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 24 లక్షల ఉద్యోగాలు కూడా తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ ఈ దీక్షలకు టిడిపి , సిపిఎం , సిపిఐ , నాయకుల మద్దతు ఇవ్వడం జరిగిందిఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్న నిరుద్యోగులు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అన్యాయం

## మంత్రి అవంతి శ్రీనివాస్

విశాఖపట్నం జూలై 14, (( విభారె) ) స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం పై ఎంపీ విజయసాయిరెడ్డి అద్వర్యంలో కార్మిక సంఘాల నేతలతో సమావేశం ఏర్పాటు చేసాం. ఎంతో మంది త్యాగాలు, ప్రాణాలు తో ఇక్కడ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు జరిగింది. కేంద్ర,రాష్ట్రాలు గత 20 సంవత్సరాల్లో ఎంతో ఆదాయం ఇచ్చింది విశాఖ స్టీల్ ప్లాంట్. అలాంటి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తే చాలా అన్యాయని పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దు అంటూ ముఖ్యమంత్రి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి 2 సారులు లేఖలు రాశారు. 153 రోజుల నుంచి స్టీల్ ప్లాంట్ కార్మికులు దీక్షలు చేస్తుంటే కేంద్రం కి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కి ఎన్ని హామీలు ఇచ్చారు కానీ ఎక్క హామీని నెరవేర్చలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏపీలో ఉన్న ఏకైక అతి పెద్ద కర్మాగారం స్టీల్ ప్లాంట్ ని ప్రైవేటీకరణ చేయడానికి చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాగే ముందుకు వెళ్తే ఖచ్చితంగా ఉద్యమం ఉధృతంగా చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమం ఢిల్లీ వీధుల్లో చేసి తెలుగు వారి సత్తా చూపిస్తాం. రాబోయే పార్లమెంట్ సభా సమావేశాల్లో గట్టిగా స్టీల్ ప్లాంట్ అంశం పై కేంద్రాన్ని నిలదిస్తామని అన్నారు.ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న కేంద్ర సంస్థలను ప్రైవేటీకరణ చేయడం కేంద్ర ప్రభుత్వ ఆలోచన. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వైసీపీ వ్యతికరేకిస్తుంది. నష్టాల్లో ఉన్న సంస్థలను లాభల్లోకి తీసుకురావాలి కానీ ప్రైవేటు వ్యక్తులకు అమ్మకూడదు. విశాఖ స్టీల్ ప్లాంట్ కి సొంత మైన్స్ కేటాయిస్తే కచ్చితంగా స్టీల్ ప్లాంట్ లాభాల బాటలు నడుస్తుంది. విశాఖ కు దగ్గరలో ఉన్న మైన్స్ ని కేటాయిస్తే స్టీల్ ప్లాంట్ లాభల బాటలో నడుస్తుంది. కొత్తగా వచ్చిన కేంద్ర మంత్రిని కలిని స్టీల్ ప్లాంట్ అంశాలను వివరిస్తామని అన్నారు. బీజేపీ ఏతర పక్షాలను అటు రాజ్యసభ, లోకసభ లో పోడియం ముందు మా నిరసన తెలియచేస్తాం. జంతర్ మంతర్ లో 2 రోజుల పాటు నిరసన తెలపాలి అని కార్మిక సంఘాలు నిర్ణయించారు స్టీల్ ప్లాంట్ ని వ్యతిరేకించే అన్ని పార్టీలను తీసుకు వెళ్లి జంతర్మంతర్దగ్గర నిరసన చేస్తాం. త్వరలోనే సీఎం తో కార్మిక సంఘాల నేతల భేటి ఉంటుందని అన్నారు.

## రేషన్ పంపిణీ సంచార వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన నంద్యాల సబ్ కలెక్టర్

నంద్యాలజూలై 14, (( విభారె) బుధవారం నంద్యాల మండలం లోని చాపిరేవుల గ్రామములో రేషన్ పంపిణీ సంచార వాహనాల పనితీరును నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నంద్యాల సబ్ కలెక్టర్ చహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో రేషన్ పంపిణీ చేస్తున్న రేషన్ పంపిణీ సంచార వాహనాల పనితీరుపై తనిఖీ చేశారు. కార్డు దారులకు రేషన్ పంపిని విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేయాలని యమ్ డీ యు లను ఆదేశించామన్నారు. పంపిణి విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రేషన్ పంపిణీపై యమ్ డు యు సిబ్బంది కి తగిన సూచనలు సలహాలు కూడా ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. వీరి వెంట ఏ యస్ ఓ ఆచార్యులు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు . ఫుడ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ రెడ్డి. సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఈ చిట్కాలతో వర్షకాలంలో వచ్చే వ్యాధులకు చెక్ పెట్టొచ్చు...




వర్షాకాలం వస్తే మనకు కచ్చితంగా వేడి నుండి ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ సీజన్లో మన రోగ నిరోధక శక్తి సన్నగిల్లే ప్రమాదం కూడా ఉంది. దీని వల్ల మనం మాన్ సూన్ కు సంబంధించిన అంటువ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఈ కాలంలో చికున్ గున్యా, టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో మీరు అలాంటి వ్యాధుల బారిన పడకుండా ఇంట్లోనే ఉంటూ కొన్ని రెమెడీస్ ను తయారు చేసుకోవాలి. అలాగే రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. ఈ సందర్భంగా ఇంట్లో ఏయే వస్తువులతో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం... :కెప్టెన్ కోహ్లీ వర్కవుట్ల విషయంలో తగ్గట్లేదుగా... పసుపు.. పసుపు.. మనలో ప్రతి ఒక్కరి ఇంట్లో పసుపు కచ్చితంగా ఉంటుంది. ఇది సహజంగా దొరుకుతుంది. ఇందులో యాంటీమైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ మరియు యాంటి ఇన్ఫ్లమేటరీ పుష్కలంగా ఉంటాయి. దీన్ని మీరు ప్రతి వంటకంలో తగినంతగా కచ్చితంగా వాడాలి. దీని వల్ల మీ రోగనిరోధక శక్తి కచ్చితంగా మెరుగవుతుంది. అలాగే మీ బాడీలో ఉండే విషాన్ని కూడా బయటకు పంపుతుంది. ఈ పసుపును ఎక్కువగా మసాలా ఆహారాల్లో వాడండి లేదా వర్షాకాలంలో మీకు రక్షణగా ఉండేందుకు పాలల్లో చిటికెడు పసుపు కలిపి తీసుకోవచ్చు. అల్లం.. అల్లం.. అల్లంలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీన్ని ఎక్కువగా మసాలా వంటకాలలో వాడుతూ ఉంటారు. ఇది మీ బాడీలో రోగనిరోధక శక్తిని బాగా పెంచుతుంది. అలాగే మీ జీర్ణక్రియ సులువుగా అయ్యేందుకు తోడ్పడుతుంది. ఇక వర్షాకాలంలో మీరు ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉండాలంటే.. అల్లం టీని వారానికి కనీసం రెండుసార్లైనా తాగాలి. ఇది అనారోగ్యం నుండి కాపాడటంలో పుష్కలంగా పని చేస్తుంది. దీనిలో మీ బాడీలో నొప్పిని తగ్గించే అవసరమైన పోషకాలు కూడా నిండి ఉన్నాయి. దాల్చిన చెక్క.. దాల్చిన చెక్క.. మన ఇళ్లలోని వంటగదిలో విరివిగా లభించే వాటిలో దాల్చిన చెక్క ఒకటి. దీన్ని ఎక్కువగా మసాలా వంటకాల్లో ఉపయోగిస్తారు. ఈ సుగంధ ద్రవ్యాన్ని వేలాది సంవత్సరాలుగా మన పూర్వీకుల నుండి నేటి తరం వరకు ప్రతి ఒక్కరూ వాడుతున్నారు. ఇందులో ఎన్నో ఔషధ లక్షణాలున్నాయి. దాల్చిన చెక్కను తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, గొంతులో మంట వంటివి తగ్గుతాయి. ముఖ్యంగా వర్షాకాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లు రాకుండా ఇది బాగా ఉపయోగపడుతుంది. అంతేకాదు ఈ మసాలా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడానికి మరియు గుండె జబ్బులు రాకుండా నిరోధించడానికి పైన్ నట్స్ సరిపోతాయి! మెంతులు.. మెంతులు.. సాధారణంగా మనలో చాలా మంది మెంతులను బాగా నానబెట్టి వంటకాలలో వాడుతూ ఉంటారు. ఈ మెంతి విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కూడా రోగ నిరోధక వ్యవస్థకు మెరుగయ్యేలా పని చేస్తాయి. వీటిలో ఇతర పోషకాలు కూడా అధికంగా ఉంటాయి. ఇవి మన బాడీలో నీటి నిల్వలను తగ్గించడానికి ఉపయోగపడతాయి. హెర్బల్ టీ లేదా గ్రీన్ టీ.. హెర్బల్ టీ లేదా గ్రీన్ టీ.. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు, మీ రోగ నిరోధక శక్తిని మెరుగుపరుచుకునేందుకు హెర్బల్ టీ లేదా గ్రీన్ టీ కూడా రెగ్యులర్ గా తీసుకోండి. ఈ టీలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గుతో పాటు ఇతర ఇన్ఫెక్షన్లు మీ దరి చేరకుండా కాపాడతాయి. వెచ్చని కప్పు టీని సిప్ చేయడం వల్ల మీ గొంతుకు కూడా ఉపశమనం కలుగుతుంది.

## వార్నర్, కోహ్లీలను వెనక్కు నెట్టిన పాక్ కెప్టెన్..

న్యూఢిల్లీ: పాకిస్థాన్ కెప్టెన్, ప్రపంచ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్ బాబర్ ఆజమ్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 14 సెంచరీలు బాదిన బ్యాట్స్‌మన్‌గా చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్‌తో మంగళవారం అర్ధరాత్రి వరకు జరిగిన మూడో వన్డేలో బాబర్ ఆజామ్ (139 బంతుల్లో 158; 14 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కి కెరీర్‌లో 14వ శతకాన్ని నమోదు చేశాడు. బాబర్ ఈ ఘనతను కేవలం 81 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు. దీంతో ఈ జాబితాలోని దక్షిణాఫ్రికాకు చెందిన హాషీమ్ ఆమ్లా(84 ఇన్నింగ్స్‌లు), ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్(98 ఇన్నింగ్స్‌లు), టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ (103 ఇన్నింగ్స్‌లు)లను వెనక్కునెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు మహిళల క్రికెట్‌లోనూ ఏ బ్యాటర్ కూడా బాబర్ సాధించినంత తొందరగా 14 సెంచరీలు సాధించలేదు. ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్ మెగ్ లాన్నింగ్ 14 సెంచరీలు సాధించడానికి 82 ఇన్నింగ్స్‌లు ఆడాల్సి వచ్చింది


# పుష్ప తర్వాత బోయపాటితోనే బన్నీ సినిమా..!



అల వైకుంఠపురములోc సినిమాతో సూపర్ హిట్ అందుకున్న స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్.. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ఇమేజ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో నటిస్తున్న cపుష్పc చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ఐదు ప్రధాన భాషల్లో రూపొందిస్తున్నారు. ఈ యాక్షన్ ఎంటర్టైనర్ రెండు భాగాలుగా విడుదల కానుంది. భవిష్యత్ లో అన్నీ పాన్ ఇండియా చిత్రాలే చేయాలని నిర్ణయించుకున్న బన్నీ.. దానికి తగ్గట్టుగానే ఏఆర్ మురగదాస్ - బోయపాటి శ్రీను - కొరటాల శివ - ప్రశాంత్ నీల్ వంటి అగ్ర దర్శకులను లైన్ లో పెట్టాడు. ఇటీవలే బన్నీ స్నేహితుడు బన్నీ వాస్ ఈ లైనప్ గురించి వివరించారు. అయితే అల్లు అర్జున్ తో సినిమాలు చేయబోయే దర్శకుల ఆర్డర్ పై క్లారిటీ రాలేదు. ఇప్పటికే cపుష్ప 1c చిత్రానికి సంబంధించిన మెజారిటీ భాగం షూటింగ్ కంప్లీట్ అయింది. రీసెంటుగా ప్రారంభించిన షెడ్యూల్ లో మిగతా చిత్రీకరణను పూర్తి చేయనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో లేదా 2022 ప్రారంభంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే cపుష్పc పార్ట్-1 తర్వాత వెంటనే cపుష్ప 2c చేయకుండా.. వేరే ప్రాజెక్ట్ చేయాలని బన్నీ ఫిక్స్ అయ్యారు. అందుకే వేణు శ్రీరామ్ దర్శకత్వంలో cఐకాన్c అనే సినిమాని ముందు పూర్తి చేయనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ కథని పాన్ ఇండియా స్క్రిప్ట్ మార్చే పనిలో ఉన్నారని టాక్. అల్లు అర్జున్ cఐకాన్c సినిమా ముగించుకుని వచ్చే సమయంలో విజయ్ దేవరకొండ తో సుకుమార్ ఓ సినిమా చేయనున్నాడు. ఆ తర్వాత మళ్ళీ cపుష్ప 2c పనులు మొదలు కానున్నాయి. దీని తర్వాత ఊర మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో బన్నీ సినిమా చేసే అవకాశం ఎక్కువగా ఉందని సినీ వర్గాల్లో అనుకుంటున్నారు. గతంలో బన్నీ - బోయపాటి కాంబోలో వచ్చిన cసరైనోడుc సినిమా సూపర్ హిట్ అవడమే కాకుండా.. స్టైలిష్ స్టార్ లోని మాస్ యాంగిల్ ని కంప్లీట్ గా బయట పెట్టింది. అందుకే వీరి కలయికలో మళ్ళీ ఓ సినిమా కోసం ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో గీతా ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అరవింద్ నిర్మాణంలో సినిమా చేయడానికి ఆల్రెడీ బోయపాటి అడ్వాన్స్ తీసుకున్నారని తెలుస్తోంది. అంతేకాదు cపుష్ప 2c తర్వాత అల్లు అర్జున్ చేయబోయే ప్రాజెక్ట్ ఇదేనని టాక్ నడుస్తోంది. దీనిపై త్వరలోనే కంఫర్మేషన్ వస్తుందేమో చూడాలి. ఇకపోతే కొరటాల శివ - మురుగదాస్ - ప్రశాంత్ నీల్ లతో కూడా అల్లు అర్జున్ సినిమాలు చేయనున్నారు. ఇటీవల ప్రముఖ తమిళ నిర్మాత ఎస్.థాను.. బన్నీ తో ఓ ప్రాజెక్ట్ కోసం చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. దీంతో అల్లు అర్జున్ - ఏ.ఆర్ మురుగదాస్ కాంబోలో రూపొందనున్న చిత్రాన్ని ఎ క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్.థాను నిర్మించే ఛాన్సెస్ ఉన్నాయని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇది మురగదాస్ సినిమానా లేదా మరో కొత్త మూవీనా అనే దానిపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే. ఇక కొరటాల శివ - బన్నీ కాంబినేషన్ లో సినిమా హోల్డ్ లో పడినప్పటికీ.. ప్రస్తుతమున్న స్టార్ డైరెక్టర్ కమిట్మెంట్స్ పూర్తైన తర్వాత వీరు కలసి సినిమా చేస్తారని తెలుస్తోంది.

# క్రాక్ నిర్మాత పవన్ ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్ చెప్పబోతున్నాడా?


పవన్ కళ్యాణ్ హీరోగా ప్రస్తుతం వరుసగా సినిమాలు రూపొందుతున్నాయి. గతంలో మాదిరిగా పవన్ ఒక్కో సినిమాకు ఏళ్లకు ఏళ్ల సమయం తీసుకోవడం లేదు. ఒక్కో సినిమాను మూడు నాలుగు నెలలు అంతకు తక్కువ సమయంలోనే ముగించేస్తున్నాడు. ఇటీవలే వకీల్ సాబ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ ఆ తర్వాత రానాతో కలిసి నటిస్తున్న మలయాళ మూవీ రీమేక్ తో రాబోతున్నాడు. ఆ తర్వాత క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న హరి హర వీరమల్లు సినిమా తో వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ రెండు సినిమాలు కాకుండా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో ఒక సినిమా కు ఓకే చెప్పాడు. ఆ సినిమా షూటింగ్ కూడా కాస్త అటు ఇటుగా ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇంతటి బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ మరి కొన్ని కథలకు



కొందరు దర్శకులకు కూడా ఓకే చెప్పాడనే వార్తలు వస్తున్నాయి. పెద్ద ఎత్తున అంచనాల నడుమ పవన్ సినిమా లు రూపొందబోతున్నాయి. పవన్ కళ్యాణ్ మరియు పూరిల కాంబో సినిమా కోసం అభిమానులు సుదీర్ఘ కాలంగా వెయిట్ చేస్తున్నారు. వీరి కాంబోలో రెండు సినిమా లు వచ్చాయి. ఆ రెండు సినిమాలు కూడా మంచి టాక్ ను దక్కించుకున్నాయి. ఇక వీరి కాంబోలో మూడవ సినిమా కోసం పలువురు నిర్మాతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా వీరి కాంబో లో బండ్ల గణేష్ ఒక సినిమా ను చేయబోతున్నట్లుగా ఆ మద్య వార్తలు వచ్చాయి. కాని అవి పుకార్లే అంటే స్వయంగా బండ్ల క్లారిటీ ఇచ్చాడు. ఇక వీరిద్దరి కాంబో మూవీ మళ్లీ ప్రచారంలో నిలిచింది. ప్రముఖ నిర్మాత ఠాగూర్ మధు కు కొన్నాళ్ల క్రితం పవన్ డేట్లు ఇచ్చాడట. ఇప్పుడు ఆ సినిమాను చేసేందుకు ఓకే చెప్పాడని తెలుస్తోంది. ఠాగూర్ మధు ఇటీవల సన్నిహితుల వద్ద మాట్లాడుతూ పవన్ మూవీ గురించి ప్రస్తావించాడు అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఠాగూర్ మధు నిర్మించబోతున్న సినిమాకు పూరి దర్శకత్వం వహిస్తాడని అంటున్నారు. ఇప్పటికే పవన్ మరియు పూరిల మద్య కథా చర్చలు మొదటి దశ జరిగినట్లుగా చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ ను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో పక్కా కమర్షియల్ సబ్జెక్ట్ తో ఒక సినిమాను తెరకెక్కించేందుకు గాను పూరి రెడీ అవుతున్నట్లుగా చెబుతున్నారు. ప్రస్తుతం పూరి లైగర్ సినిమాను చేస్తున్నాడు. విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న లైగర్ సినిమా లో హీరోయిన్ గా అనన్య పాండే నటిస్తున్న విషయం తెల్సిందే. పాన్ ఇండియా సినిమా గా లైగర్ ను తెరకెక్కిస్తున్న పూరి త్వరలోనే పవన్ తో సినిమా ను మొదలు పెడతాడని అభిమానులు ఆశ పడుతున్నారు. ఈ విషయమై ఠాగూర్ మధు స్పష్టత ఇవ్వాలని కొందరు అభిమానులు కోరుకుంటున్నారు. మరి ఆయన ఎప్పటికి స్పష్టత ఇస్తాడో చూడాలి. పవన్ మరియు పూరి ల సినిమా అంటే ఖచ్చితంగా మరో రేంజ్ లో ఉంటుంది.. ఉండాలని అభిమానులు మొదటి నుండే అంచనాలు పెంచుకుంటూ ఉంటారు. ఆ అంచనాలను అందుకోవాలంటే పూరి చాలా వర్క్ చేయాల్సి ఉంటుంది. మరి ఆ రేంజ్ లో పూరి స్క్రిప్ట్ ను రెడీ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం లో సఫలం అవుతాడా అనేది చూడాలి. అయితే పవన్ ఇప్పటికే పలు సినిమా లు కమిట్ అయ్యాడు. కనుక పూరితో సినిమా అంటే 2023 వరకు సమయం పట్టే అవకాశాలు కూడా లేక పోలేదు అంటున్నారు. అప్పటి వరకు పూరి వెయిట్ చేస్తాడా లేదంటే ఇతర హీరోలతో సినిమాలు కానిస్తాడా అనేది చూడా తెలియాల్సి ఉంది.

# యువ హీరోకి ఇకపై అన్నీ మంచి శకునములే..!

cగోల్కొండ హైస్కూల్c సినిమాలో కనిపించిన cవర్షంc దర్శకుడు శోభన్ తనయుడు సంతోష్ శోభన్.. cతను నేనుc చిత్రంతో హీరోగా ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు. 2018లో cపేపర్ బాయ్c సినిమాతో పలకరించిన యంగ్ హీరో.. మూడేళ్ళ గ్యాప్ తర్వాత ఇటీవల cఏక్ మినీ కథc చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. యూవీ కాన్సెప్ట్ బ్యానర్ లో రూపొందిన ఈ సినిమా ఓటీటీ వేదికగా విడుదలై సూపర్ హిట్ అయింది. సంతోష్ కు హీరోగా మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది. దీంతో ఇండస్ట్రీ ప్రముఖుల దృష్టిలో పడిన సంతోష్ శోభన్ కు వరుస అవకాశాలు వచ్చి పడుతున్నాయి. అభిషేక్ మహర్షి అనే డెబ్యూ డైరెక్టర్ తో ccప్రేమ్ కుమార్cc అనే రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ లో నటిస్తున్నాడు సంతోష్ శోభన్. ఇప్పటికే వదిలిన టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ ఆసక్తికరంగా ఉన్నాయి. సారంగ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై శివప్రసాద్ పన్నీరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పీటల మీద పెళ్లి ఆగిపోవడంతో.. ఓ యువకుడు ఫ్రస్టేషన్ లో ఏం చేశాడనే కాన్సెప్ట్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. దీనికి డైరెక్టర్ అభిషేక్ మహర్షి - రచయిత అనిరుధ్ కృష్ణమూర్తి కలిసి కథ అందించారు. అనంత్ శ్రీకర్ సంగీతం సమకూర్చగా.. కిట్టు విస్సాప్రగడ పాటలు రాస్తున్నారు. రాంపీ నందిగాం సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి గ్యారీ బీహెచ్ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. 80 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇకపోతే మారుతి దర్శకత్వంలో మెహ్రీన్ హీరోయిన్ గా సంతోష్ శోభన్ ఓ సినిమా చేస్తున్నాడు. దీనికి cమంచి రోజులు వచ్చాయిc అనే టైటిల్ పరిశీలనలో ఉంది. అలానే cఓ బేబీc సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నందినీ రెడ్డి దర్శకత్వంలో ccఅన్నీ మంచి శకునములేcc అనే చిత్రాన్ని ఇటీవలే ప్రకటించాడు యువ హీరో. cజాతిరత్నాలుc వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న స్వప్న సినిమాస్ బ్యానర్ పై ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన cఅన్నీ మంచి శకునములేc




టైటిల్ మరియు మోషన్ పోస్టర్ సినిమాపై అంచనాలు కలిగించాయి.

# వాలిమై చిత్రానికి రాధే కలర్స్ కనిపిస్తున్నాయే..!!

కోలీవుడ్ స్టార్ హీరో cతలాc అజిత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ccవాలిమైcc. హెచ్.వినోద్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో బేవ్యూ ప్రాజెక్ట్స్ బ్యానర్ పై బోనీకపూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'నెర్కొండ పార్వైవ తర్వాత అజిత్ - వినోద్ - బోనీకపూర్ కలయికలో వస్తున్న సినిమా ఇది. ఇందులో సీబీ సీఐడీ ఆఫీసర్ గా అజిత్ కనిపించనున్నారు. వాలిమై ఫస్ట్ లుక్ కోసం ఎంతో కాలంగా అభిమానులు కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఏడాది కాలంగా అజిత్ ఫస్ట్ లుక్ కోసం ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. హీరో బర్త్ డేకు కూడా అప్డేట్ ఇవ్వకపోవడంతో అసహనానికి గురైన ఫ్యాన్స్.. ఒకానొక దశలో ప్రొడక్షన్ హౌస్ మీద నెగెటివ్ ట్రెండ్ కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఇన్నాళ్ళు వెయిట్ చేసిన అభిమానులకు అజిత్ డబుల్ ట్రీట్ ఇచ్చారు. ఆదివారం ccవాలిమైcc సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ తో పాటుగా మోషన్ పోస్టర్ ను కూడా విడుదల చేసి సర్ప్రైజ్ చేశారు. ఎట్టకేలకు అజిత్ సినిమా ఫస్ట్ లుక్ వచ్చిందని సోషల్ మీడియా మాధ్యమాల వేదికగా ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో యాంటీ ఫ్యాన్స్ అజిత్ ఫస్ట్ లుక్ పై నెగెటివ్ కామెంట్స్ కూడా చేస్తున్నారు. cవాలిమైc ఫస్ట్ లుక్ ఓ టీవీ యాడ్ నుంచి కాపీ చేసారని స్క్రీన్ షార్ట్స్ పెడుతూ ట్రోలింగ్ మొదలు పెట్టేసారు. అంతేకాదు cవాలిమైc మోషన్ పోస్టర్ చూస్తుంటే cరాధేc కలర్స్ కనిపిస్తున్నాయని కామెంట్స్ పెడుతున్నారు. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన చిత్రం ccరాధే: మోస్ట్ వాంటెడ్ భాయ్cc. ప్రభుదేవా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈద్ సందర్భంగా ఓటీటీ వేదికగా రిలీజ్ అయింది. విడుదలకు ముందు భారీ హైప్ క్రియేట్ చేసిన ఈ చిత్రం.. రిలీజ్ అయ్యాక ప్రేక్షకులను నిరాశకు గురి చేసింది. ఇప్పుడు ccవాలిమైcc మోషన్ పోస్టర్ cరాధేc ని పోలి ఉందని.. ఆదమరుపుగా చూస్తే సల్మాన్ ఖాన్ సినిమా అనుకునేవారు కూడా లేకపోలేదని యాంటీ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరి అజిత్ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**